
# జవాబు(లు)



కాఫీ కప్పు క్రింద పెడుతూ అడిగాడు లాయర్ విశ్వనాథ్ - "ఇప్పుడు చెప్పండి నన్నెందుకు పిలిపించారో"

డాక్టర్ రాజారామ్ నెమ్మదిగా అన్నాడు-

"నా భార్యకు విడాకులు ఇవ్వాలనుకుంటున్నాను"

విశ్వనాథ్ ఒక్కసారిగా ఆశ్చర్య పోయాడు - "అదేమిటి డాక్టర్! పదేళ్ళ దాంపత్య జీవితం సుఖంగా గడిపి ఇప్పుడు విడాకులేమిటి?" అడిగాడు తేరుకొని.

ఒక క్షణం ఆగి అన్నాడు రాజారామ్ - "మా ఆవిడ ఒక ప్రముఖ దినపత్రికలో రోజూ పాఠకుల ప్రశ్నలకు జవాబులు యిస్తుంది! మీకు తెలుసు కదూ!"

"తెలుసు - ఆ శీర్షిక వల్ల ఈ ఆరేడు ఏళ్ళలోనూ, ఆవిడకు చాలా పేరు కూడా వచ్చింది - కానీ అలా జవాబులు యిచ్చినందువల్ల, విడాకులు యివ్వవలసిన అవసరమేమిటి?" లాయర్ విశ్వనాథ్ అడిగాడు.

"ఒక క్షణం ఆగండి!" అని రాజారామ్ లేచి, ప్రక్కన వున్న టేప్ రికార్డర్‌లో - ఒక కాసెట్ వుంచాడు.

"ఇంత చిన్న విషయానికి విడాకులు యివ్వవలసిన పనిలేదు. కానీ యివ్వాల్సి రావటం

నా దురదృష్టం. ఈ గాయిత్రీ గోంగూర్ పత్రికలలో ఎలాటి ప్రశ్నలకు ఎలాటి జవాబులు యిచ్చినా ఫరవాలేదు. ఇష్టం వున్నవాళ్ళు చదువుతారు లేనివాళ్ళు లేదు - కానీ ప్రతి రోజు నాకు కూడా అలాగే .... ఎన్నాళ్ళని భరించటం... తను ఎన్నో పుస్తకాలు చదివి వుండవచ్చుకానీ... నా రియాక్షన్స్ కూడా గ్రహించి.... సారీ.... ఎక్కువగా మాట్లాడుతున్నాను. మొన్న ఆదివారం సాయంత్రం బాల్కనీలో కూర్చుని, మేము మాట్లాడు కుంటున్నప్పుడు జరిగిన సంభాషణ గాయిత్రికి తెలియకుండా రికార్డు చేశాను. అది వింటే నా బాధ మీకు అర్థం అవుతుంది...." అంటూనే టేప్ రికార్డర్ ఆన్ చేశాడు డాక్టర్ రాజారామ్.

అందులోంచి మాటలు వినపడుతున్నాయి.

"చాల రోజుల తర్వాత యిలా సాయంత్రం పూట చల్లగాలిలో కూర్చుని, నీతో ఆనందంగా గడిపే అవకాశం దొరికింది" - రాజారామ్.

"అవును - రెండవ ప్రపంచ యుద్ధం ముందర నెపోలియన్ కూడా ఇలాగే అందమైన సాయంత్రాలు సరదాగా గడిపేవాడట. తర్వాత ఇలాంటి సాయంత్రాలు గడపలేక పోయానని వాపోతూ 'మి అండ్ మై లైఫ్' అనే పుస్తకంలో రాసుకున్నాడు".

"వాడి సంగతి మనకెందుకు గాయత్రీ, ఈ హాస్పిటల్లో ఉద్యోగంబోరు కొట్టేస్తున్నది నాకు. క్షణం తీరిక వుండదు. అప్పుడప్పుడు ఈ డాక్టర్ కోర్సు ఎందుకు చదివానా అనిపిస్తుంది కూడాను!"

"1955లో డాక్టర్ ఫెదర్ స్టోన్ లండన్ ఈవినింగ్ ట్రిబ్యూన్ పేపరులో ఒక వ్యాసం వ్రాశాడు - తనలో కూడా సరిగ్గా ఇలాంటి భావాలే వస్తున్నాయని కాకపోతే అతను తన యాభయి ఆరేళ్ళ జీవితంలోనూ........"

"గాయిత్రీ - ముందు మన సంగతి ఆలోచిద్దాం. ఈ చల్లటి సాయంత్రాన్ని వృథా చేయకు - కాసేపు చక్కగా కబుర్లు చెప్పుకుందాం - భోజనం చేసిన తర్వాత ఏదన్నా సినిమాకు వెళదాం!'
'

"ఈ సినిమాలు అన్నవి సెల్యులాయిడ్‌తో తయారుచేసిన ఫిల్ము మీద ప్రింటు చేస్తారు. ఇవి 8mm, 16mm, 35mm, 70mm, అని రకరకాల సైజుల్లో వుంటాయి. ఫిల్ము సైజును బట్టి, ప్రొజెక్టర్లు వుంటాయి. ప్రపంచంలో మొట్టమొదటగా ఈ సినిమాలను కనిపెట్టింది....."

"గాయత్రీ-" రాజారామ్ అరుపు పెద్దగా వినపడింది రికార్డర్‌లో.

డాక్టర్ రాజారామ్‌లేచి, టేప్‌రికార్డర్ ఆఫ్ చేశాడు.

మాట్లాడకుండా విశ్వనాథ్ కేసి చూశాడు.

విశ్వనాథ్ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

అప్పుడే వచ్చింది గాయత్రి, రెండు కప్పులతో కాఫీ తీసుకొని.

"అలా కూర్చో గాయిత్రీ" అన్నాడు రాజారామ్.

గాయత్రీ కూర్చున్నది. పమిట నిండుగా కప్పుకున్నది.

"విడాకుల ప్రయత్నం మీద లాయర్ విశ్వనాథ్ గార్ని రమ్మన్నాను. నీ అభిప్రాయం ఏమిటి గాయత్రీ" అడిగాడు రాజారామ్

ఒక క్షణం ఆలోచించి, "ఈ విడాకులు అన్నవి ఇటలీ ఫ్రాన్స్, దేశాలలో ఎక్కువ. తరువాత స్థానం అమెరికాది. ఇండియాలో విడాకులు చాలా తక్కువనే చెప్పాలి. స్విట్జర్లాండ్ మాత్రం ఎనిమిదో స్థానంలోకి వస్తుంది" అన్నది రచయిత్రి గాయత్రీ గోంగూర్.

డాక్టర్ రాజారామ్, లాయర్ విశ్వనాథ్ బిత్తరపోయి చూశారామె వైపు. ●

*(తెలుగు వెలుగు: జనవరి 1980)*